క్లుప్తంగా

క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్న డీఎంహెచ్ఓ మనోహార్

భువనగిరి : పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద క్షయ వ్యాధిగ్రస్తులకు రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి, నవభారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం న్యూట్రిషన్ కిట్లను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్షయ రోగులకు క్లబ్ ఆధ్వర్యంలో న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కరిపే నర్సింగ్‌రావు, కార్యదర్శి సత్యనారాయణ, ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ప్రొగ్రాం ఆఫీసర్ సాయిశోభ, యూత్ సభ్యులు భరత్, సిబ్బంది ఉన్నారు.

'పిలాయిపల్లి' నుంచి సాగునీరు విడుదల



పిలాయిపల్లి కాలువ నుంచి సాగునీరు విడుదల చేస్తున్న సిబ్బంది

భూదాన్‌పోచంపల్లి : పిలాయిపల్లి కాలువ నుంచి శనివారం సాయంత్రం సాగునీటిని విడుదల చేశారు. కాగా మండలంలోని జగత్‌పల్లి సమీపంలో కాల్వ సరిపడా లోతు లేకపోవడంతో దిగువకు పూర్తి స్థాయిలో సాగునీరు పారడంలేదు. ప్రభుత్వం సాగునీటి కాల్వల మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో వరికోతలు పూర్తవ్వగానే మరమ్మతులు చేపట్టారు. రైతులకు ఇబ్బంది కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి ఈనెలాఖరు వరకు సాగునీటిని విడుదల చేయాలని ఇటీవల కాల్వ సందర్శన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు శనివారం సాయంత్రం పిలాయిపల్లి కాలువ రెగ్యులేటరీ వద్ద గేట్లు ఎత్తి దిగువకు సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆయకట్టు రైతులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్ కృతజ్ఞతలు తెలిపారు.


తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

రామన్నపేట : గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 25 నుంచి 27వ వరకు తెలంగాణ తైక్వాండో అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్ జూనియర్స్ పోటీల్లో రామన్నపేట వివేకానంద హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్స్ 25కేజీల విభాగంలో సాల్వేరు శ్రీరంజన్ వంజరి సిల్వర్ మెడల్, కందుకూరి రిత్విక్ కాంస్య పతకం, 29కేజీల సబ్ జూనియర్ విభాగంలో రేఖ మణిదీప్ కాంస్య పతకం, 32కేజీల విభాగంలో పల్లెపాటి మనోహర్ కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, మాస్టర్ పట్టెడి సుధాకర్‌ను కరస్పాండెంట్ తిరుగుడు మల్లికార్జున్ అభినందించారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి

తుర్కపల్లి : మండల కేంద్రంలోని మహిళాసమైఖ్య కార్యాలయంలో 35గ్రామ స్వయం సహాయక సంఘాల నూతన పదాధికారులకు సంఘాల నిర్వహణ, బాధ్యతలపై శనివారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి పాల్గొని మాట్లాడారు. స్వయం సహాయక సంఘాల నిర్వహణ, ప్రభుత్వ పథకాలు, ఆర్యోగం, పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ సీఆర్పీలు జిల్లా ఐబీ ఏపీఎం మల్లేషం, మండల ఏపీఎం చెంచల యాదగిరి, సీసీలు పరుశురాములు, శివకుమార్, అకౌంటెంట్ లక్ష్మి, కంప్యూటర్ ఆపరేటర్ షాహిన్ పాల్గొన్నారు.

పదాధికారులకు అవగాహన సదస్సులు

భువనగిరిటౌన్ : పట్టణంలోని జెడ్పీ కార్యాలయంలో భువనగిరి మహిళా సమాఖ్య కార్యాలయాలలో నూతనంగా ఎన్నికైన గ్రామ సంఘం పదాధికారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ టి.నాగిరెడ్డి, అదనపు డీఆర్‌డీఓ కొత్త జంగారెడ్డి హాజరై గ్రామాభివృద్ధిలో సంఘాల పాత్ర, బాధ్యతలపై సూచనలు తెలిపారు. శిక్షణలో డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నమ్మకం కల్పించి.. బడిబాట పట్టించి

- రాజాపేట మండలంలో ప్రభుత్వ స్కూళ్లకు ఆదరణ
- ఇప్పటి వరకు 288విద్యార్థుల చేరిక
- రఘునాథపురం పాఠశాల జిల్లాలోనే ప్రథమస్థానం
- సత్ఫలితమిచ్చిన విద్యాశాఖ చర్యలు



రఘునాథపురంలో విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

రాజాపేట : ప్రభుత్వ బడుల బలోపేతానికి జిల్లా విద్యాశాఖ చేపట్టిన చర్యలు సత్ఫలితమిస్తున్నాయి. గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా అన్ని స్కూళ్లలో 288 అడ్మిషన్లు నమోదయ్యాయి. ఆగస్టు వరకు మరికొంత ఎన్‌రోల్‌మెంట్ పెరిగే అవకాశం ఉంది.

చేపట్టిన కార్యక్రమాలు ఇవీ..

ఏప్రిల్‌లో, జూన్ 6నుంచి 19వ తేదీ వరకు రెండు దఫాలు బడిబాట కార్యక్రమాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, నిపుణులైన అధ్యాపకులు, పదో తరగతిలో సాధించిన ఉత్తమ ఫలితాలపై వివరించారు. ఎంఈఓ చందామహేష్ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కూడిన ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను పాఠశాల వారీగా, తరగతుల వారీగా ఏర్పాటు చేసి ప్రభుత్వ స్కూళ్ల ప్రాధాన్యతపై ప్రచారం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థుల వివరాలను సేకరించారు. నేరుగా వారి తల్లిదండ్రులను ఒప్పించి తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్లకు పంపడంలో సఫలీకృతం అయ్యారు.

విద్యార్థులు ఇలా

రాజాపేట మండల పరిధిలో 13 ఉన్నత, 26 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. గత ఏడాది 1నుంచి 5వ తరగతి వరకు 1011, ఆరు నుంచి టెన్త్ వరకు 1,497 మంది విద్యార్థులున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 2,508 విద్యార్థులు విద్యనభ్యసించారు. ఈ విద్యా సంవత్సరం ఇప్పటి వరకు 1నుంచి 10వ తరగతుల్లో కొత్తగా 644 మంది విద్యార్థులు చేరారు. మొత్తం ఎన్‌రోల్‌మెంట్ 2,796 నమోదైంది. గత ఏడాది కంటే 288 విద్యార్థులు అదనం. ఇందులో 40 శాతం మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలనుంచి వచ్చారు.

రఘునాథపురం స్కూల్ ఫస్ట్

ఈ ఏడాది జిల్లాలో అత్యధికంగా ఎన్‌రోల్మెంట్ నమోదైన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలగా రఘునాథపురం ప్రథమ స్థానంలో నిలిచింది. గత ఏడాది 137మంది ఉండగా.. ఈ ఏడాది 194కు పెరిగారు. అప్పటి హెచ్‌ఎం పెంటపర్తి మాధవరెడ్డి దాతల సహకారంతో పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంతో, ఆంగ్లమాధ్యమంలో బోధన అందించారు. విద్యార్థులకు టై, బెల్టు, షూ, పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు అందించారు. దీంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



"ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు విద్యార్థులకు కావాల్సిన అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. మా గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఆంగ్లమాధ్యమంలో విద్య అందించడంతోనే నా కూతురు మేధా చారిటబుల్ ట్రస్టు, ఐటీఐ వంటి జిల్లా, రాష్ట్ర ర్యాంకులు సాధించింది.

– గొట్టిపాముల శ్రీనివాస్, రఘునాథపురం

సమష్టి కృషితోనే విద్యార్థుల చేరిక సాధ్యమైంది



"మండలంలోని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగింది. ముందస్తుగానే ప్రణాళిక ప్రకారం విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి వారిలో భరోసా కల్పించాం. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చూస్తాం.

– చందా రమేష్, మండల విద్యాధికారి

పేద ప్రజల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



ఎల్‌ఓసీ అందజేస్తున్న ప్రభుత్వ విప్ అయిలయ్య

ఆత్మకూరు(ఎం) : పేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన ఎండీ యూసుబీకి చికిత్స నిమిత్తం రూ.5లక్షల ఎల్‌ఓసీ చెక్కు అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి పేద, దిగువన, మధ్య తరగతి కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. ఆరోగ్య సమస్య పట్ల పేద కుటుంబాలకు అప్పులపాలు కావద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, నాయకులు ఎండీ కరీం, జమాల్, షానూర్, గౌస్ పాల్గొన్నారు.

ఆస్తులు అనుభవిస్తూ అమ్మానాన్నలకు అన్నం పెట్టలేరా

- తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ వెల్మ శేఖర్‌రెడ్డి



కేసులను విచారిస్తున్న వెల్మ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ : ఆస్తులు అనుభవిస్తూ అమ్మానాన్నలకు అన్నం పెట్టలేరా అని సీనియర్ సిటిజన్, తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ చైర్మన్ వెల్మ శేఖర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ మండలాలకు చెందిన వయోవృద్ధుల నుంచి ఇటీవల అందిన ఫిర్యాదులపై శనివారం పట్టణంలో ట్రిబ్యూనల్‌లో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. పట్టెడు అన్నం కోసం తల్లిదండ్రులు కోర్టులు, పోలీసులను ఎందుకు ఆశ్రయించాలని ప్రశ్నించారు. తమ పిల్లలకు ఏవిధంగా సేవలు అందిస్తున్నామో వృద్ధులైన తల్లిదండ్రులకు సైతం అదే మాదిరిగా సేవలు అందించాలన్నారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులు తమకైతే దక్కాయి, ఇక వారికి భోజనం పెట్టకున్నా మాకేమీ అవ్వదనుకుంటే కుదరదన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహిస్తే ఆస్తుల హక్కులను రద్దు చేస్తామని హెచ్చరించారు. అనంతరం కేసుల తీర్పును జూలై 19కి వాయిదా వేశారు. కార్యక్రమంలో ట్రిబ్యూనల్ మెంబర్ ముత్యాల సత్తిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగేశ్వరరావు, సెక్షన్ అధికారి కవిత, తదితరులు ఉన్నారు.

చౌటుప్పల్ అభివృద్ధిపై ప్రణాళికలు రూపొందించాలి

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : రాబోయే 30ఏళ్లకు అనుగుణంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాల్సి ఉందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే మున్సిపాలిటీలో లక్ష జనాభా నివాసం ఉంటున్నారని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. శనివారం మునుగోడులోని క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ అభివృద్ధిపై వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మాస్టర్‌ప్లాన్ కన్సల్టెన్సీ సుభానీ మాస్టర్‌ప్లాన్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ప్రజల జీవన ప్రమాణాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించాల్సి ఉందన్నారు. రాబోయే రోజుల్లో శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి చౌటుప్పల్‌కు తాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తామన్నారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఉమ్మడి జిల్లా పబ్లిక్ హెల్త్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, చౌటుప్పల్ డీఈ మనోరమ, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మాజీ ఎంపీపీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రాజుల సతీష్, మాజీ సర్పంచ్‌లు పబ్బు రాజుగౌడ్, సుర్వి నర్సింహ, నాయకుల మొగుదాల రమేష్, సైదులు, శ్రీకాంత్, రాంరెడ్డి పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని గుజ్జ గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ యువకులు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి శనివారం వినతిపత్రం అందజేశారు. వివిధ గ్రామాలకు ఉన్న రోడ్ల నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎలిజాల శ్రీను, చిహ్నం ప్రశాంత్‌కుమార్, సాంబశివరావు, రాజీవ్, బాబు ఉన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి

- జెడ్పీ సీఈఓ శోభారాణి



భూదాన్‌పోచంపల్లి : విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న జెడ్పీ సీఈఓ



సంస్థాన్ నారాయణపురం : విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న అధికారి జయశ్రీ

భూదాన్‌పోచంపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టే మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా మెనూ పాటించాలని జెడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. శనివారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఇంటర్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థులను సన్మానించారు. అలాగే జలాల్‌పురంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. అదే విధంగా పోచంపల్లి, జలాల్‌పురం గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ భాస్కర్, ఎంఈఓ ప్రభాకర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సురేశ్‌రెడ్డి, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఎస్‌ఓ ఇందిర, హెచ్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆలేరురూరల్ : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఆలేరు సీడీపీఓ స్వరాజ్యం అన్నారు. శనివారం పట్టణంలో ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిని తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని పుట్టపాక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారిణి జయశ్రీ శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె స్వయంగా విద్యార్థులకు భోజనం వడించారు. ఆమె వెంట ఎంపీఓ నర్సింహారావు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం మండల వ్యవసాయ అధికారి కీర్తి శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వారితో పాటు కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

గుండాల : విద్యార్థులకు మెనూ సక్రమంగా అందించాలని ఎంపీడీఓ పి.దేవేందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రతి విద్యార్థికి మెనూ అందించాలన్నారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం గంధం చంద్రకళ ఉన్నారు.

మండలంలోని పాచిల్ల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల పరిషత్ సూపరింటెండెంట్ డప్పు మల్లయ్య పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

వార్డుల్లో పర్యటించడంతో సమస్యలకు పరిష్కారం

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



చౌటుప్పల్ : మున్సిపల్ అధికారులు, సిబ్బందితో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

చౌటుప్పల్ : ప్రతిరోజు వార్డుల్లో పర్యటించడంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. వార్డు ఆఫీసర్లు, సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయికి వెళ్లడంతో సమస్యలు గుర్తించవచ్చన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 100రోజుల ప్రణాళికపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులపై అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. రోడ్లు, కాలనీల్లోని చెత్త ఎప్పటికప్పుడు సేకరించి తరలించాలన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, ఉద్యోగులు, సిబ్బంది, పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

చౌటుప్పల్ రూరల్ : ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలోని లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. శనివారం చౌటుప్పల్ ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించి పాలన తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మండలంలోని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన మసీదుగూడెం గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇళ్ల నిర్మాణం ఇంకా మొదలు చేయని లబ్ధిదారులు త్వరగా ప్రారంభించాలని కోరారు. ఇసుక ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఎంపీఓ అంజిరెడ్డి, కార్యదర్శి నవ్య పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న గోద శ్రీరాములు

భూదాన్‌పోచంపల్లి : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ సత్తాచాటాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. శనివారం పట్టణంలో పార్టీ 11వ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలే ఎజెండాగా ప్రజల్లోకి వెళ్లాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. పోచంపల్లికి కృష్ణా తాగునీరు అందించాలని, పోచంపల్లిలో సమీకృత మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టాలని పలు తీర్మాణాలను ఆమోదించారు. అనంతరం పార్టీ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గోదల్ల భూషణ్, సహాయ కార్యదర్శిగా ముసునూరి రాములు, కార్యవర్గ సభ్యులుగా భీమగాని నర్సింహ, సంగెం గణేశ్, మూశం శివతో పాటు 13మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో పట్టణ కార్యదర్శి మిర్యాల కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్‌రెడ్డి, బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఎండీ ఇమ్రాన్, ఏశాల అశోక్, పబ్బు యాదయ్య, మహేందర్, కాశపాక దయాకర్, నాయకులు జంగయ్య, బాల్‌నర్సింహ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

'రూ.20వేలు ఇస్తేనే ఇందిరమ్మ ఇళ్ల మంజూరు'

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీలో పరిధిలో రూ.20వేలు ఇస్తేనే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నారని, అలాంటి కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారి నుంచి, మంజూరు లేని వారికి మంజూరు చేయిస్తామని కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇవ్వకుంటే బిల్లులు మంజూరు చేయమని హుకుం జారీ చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో 20మందికి పైగా లబ్ధిదారుల నుంచి పైసలు వసూలు చేసినట్లు వారు తెలిపారు. పట్టణంలో 35వార్డులలో మున్సిపల్ అధికారులు విచారణ చేసి లబ్ధిదారులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అందె శంకర్, భావనీశ్, వంగా సురేష్, రమేష్, దయానంద్, నరేష్ ఉన్నారు.

డబ్బులు ఎవరికి ఇవ్వొద్దు.. ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్న వారికి డబ్బులు ఇవ్వొద్దని మున్సిపల్ కమిషనర్ రామలింగం శనివారం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి డబ్బులు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఎవరైనా డబ్బులు అడిగితే తన దృష్టికి తీసుకువచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు.

విద్యార్థులు లక్ష్యసాధనకు కష్టపడి చదవాలి



హైకోర్టు అడ్వకేట్ నర్సింహస్వామి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రామన్నపేట : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యసాధన కోసం ఇష్టంతో కష్టపడి చదవాలని ఈపూరి నర్సింహస్వామి ట్రస్ట్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది నర్సింహస్వామి అన్నారు. శనివారం మండలంలోని మునిపంపుల ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో 1400 నోటు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నర్సింహస్వామి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు దొడ్డి స్వామి, ధర్మేందర్, ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వసంత, మనోహర్, మంజుల, త్రివేణి ప్రసాద్, మంజుల, సరోజ, రవి, కృష్ణయ్య, రాకేష్, అమరయ్య, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆధ్యాత్మిక జ్ఞాన సప్తాహం



ప్రవచనాలు వినిపిస్తున్న చైతన్యానంద స్వామిజీ

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని శ్రీమార్కండేశ్వర స్వామి దేవాలయంలో ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగము ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞ సప్తాహం కొనసాగుతుంది. ఈ సందర్భంగా శ్రీజగద్గురు గీతాశ్రమ వ్యవస్థాపకులు జ్ఞాన చైతన్యానంద స్వామిజీ అనంతరం వశిష్ఠ రామాయణం -మానవ జీవితంపై కైవల్యోపనిషత్, శ్రీ మద్భగవద్గీత దైవాసుర సంపద్విభాగ యోగంపై శనివారం ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక జ్ఞాన సత్సంగము వ్యవస్థాపక అధ్యక్షుడు రుద్ర పాండురంగశాస్త్రి, అధ్యక్షుడు బల్ల దుర్వాసులు, ప్రధాన కార్యదర్శి గుర్రం కృష్ణ, ఉపాధ్యక్షుడు సకినాల నాగయ్య, సహాయ కార్యదర్శి తడక అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నకొండూర్ వాసికి డాక్టరేట్



డాక్టరేట్ పొందిన కానుకుర్తి శివకుమార్

చౌటుప్పల్ రూరల్ : మండలంలోని చిన్నకొండూరు గ్రామానికి చెందిన కానుకుర్తి శివకుమార్ రాజనీతి శాస్త్రంలో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఉస్మానియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ యాస్మీన్ పర్యవేక్షణలో రాజనీతి శాస్త్రంలో రెజిమ్ ఆఫ్ వైట్ కాలర్ క్రైం విత్ స్పెషల్ రిఫెరెన్స్ టూ సైబర్ క్రైం ఇన్ ఇండియా అనే అంశంపై పరిశోధన చేసి గ్రంథాన్ని సమర్పించారు. అందుకుగాను ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డి డాక్టరేట్‌ను అందజేసింది. శివకుమార్‌ను పలువురు అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

సేవలు అభినందనీయం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌ఓగా విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందిన కరుణాకర్ సేవలు అభినందనీయమని మండ వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అనంతరం కరుణాకర్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్, మాజీ ఎంపీటీసీ దిగోజు నర్సిహచారి, యాస లక్ష్మారెడ్డి, పోతగాని మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

బెల్టు దుకాణాల్లో పోలీసుల తనిఖీ

రాజాపేట : మండలంలోని చల్లూరు గ్రామంలో శనివారం బెల్టు దుకాణాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓ బెల్టు దుకాణంలో 12 కింగ్‌ఫిషర్ 19 క్వాటర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా పీవీ నర్సింహారావు జయంతి

భువనగిరిటౌన్ : పట్టణంలోని జగ్జీవన్‌రావ్ చౌరస్తాలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కూర వెంకటేష్, ప్రమోద్‌కుమార్, గుర్రాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూరు(ఎం) : ప్రభుత్వం కళాకారుల సమస్యలను పరిష్కరించాలని పీఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు అన్నారు. శనివారం మండలంలోని పల్లెర్లలో నిర్వహించిన ప్రజా నాట్యమండలి మొదటి మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో వంటిపెంటి గోపాల్‌రెడ్డి, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ వేముల భిక్షం, కార్మిక సంఘం నాయకులు నాయిని యాదిరెడ్డి, స్వామి, ఎల్లయ్య పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మోత్కూరు : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కళాకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ప్రజా నాట్య మండలి మొదటి మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాచకొండ రాములమ్మ, పిట్టల మచ్చగిరి, ఉమేష్, అలీకుమార్, చందు, రేవంత్ పాల్గొన్నారు.

ఇంజనీర్ మెంబర్‌గా భిక్షపతి ఎన్నిక

రామన్నపేట : మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన కర్రె భిక్షపతి రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికల్లో ఇంజనీర్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేశారు. పగిడిపల్లి నుంచి జాన్‌పహాడు వరకు పనిచేసే రైల్వే కార్మికులు, ఉద్యోగులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. శనివారం జరిగిన ఎన్నికల్లో ఇంజనీర్ మెంబర్‌గా ఎన్నికైన భిక్షపతిని సహచర ఉద్యోగులు, గ్రామస్తులు అభినందించారు.

భూ భారతి దరఖాస్తుల క్రోడీకరణ

చౌటుప్పల్ : ఇటీవల భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్రోడీకరిస్తున్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల నుంచి దరఖాస్తులు శనివారం ఆర్డీఓ కార్యాలయానికి చేర్చారు. చౌటుప్పల్-691, నారాయణపురం-998, వలిగొండ-603, రామన్నపేట-687, పోచంపల్లి-299 దరఖాస్తులు వచ్చాయి. వాటిని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రాథమికంగా క్రోడీకరించారు. అందిన దరఖాస్తులపై నివేదిక తయారు చేయనున్నారు. సాదాబైనామా, పీఓటీ దరఖాస్తులపై మాత్రం ప్రభుత్వం నుంచి వచ్చే ఆదేశాల ప్రకారం నిర్ణయం తీసుకోనున్నట్లు ఆర్డీఓ వెల్మ శేఖర్‌రెడ్డి తెలిపారు. తహశీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు రాత్రి పొద్దుపోయే వరకు పనిలో నిమగ్నమయ్యారు.

వాహనాల తనిఖీ

యాదగిరిగుట్ట : పట్టణంలోని వైకుంఠద్వారం వద్ద పట్టణ సీఐ భాస్కర్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేశారు. యాదగిరి క్షేత్రానికి వచ్చే భక్తులతో పాటు స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తనిఖీలు చేసినట్లు ఆయన వెల్లడించారు. అనుమానం వచ్చిన వ్యక్తుల ఆధార్‌కార్డుతో పాటు వాహన పత్రాలను పరిశీలించామన్నారు.

దుకాణాదారులు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలి

యాదగిరిగుట్ట : ప్రతి దుకాణాదారుడు ట్రేడ్ లైసెన్స్‌ను తప్పక కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ లింగస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని పలు హోటళ్లు, దుకాణాలకు ఆయన వెళ్లి ట్రేడ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణాదారులు వెంటనే మున్సిపల్ అధికారులను సంప్రదించి, లైసెన్స్‌లను తీసుకోవాలన్నారు. అంతకు ముందు 6వ వార్డులోని బాలుర వసతిగృహం వద్ద స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు.